
# అసభ్యం



— కాశీభట్ల భానుమూర్తి

"లాభం లేదు" పెదవి విరిచింది కౌసల్యాదేవి.

"అలా అంటే ఎలా మేడమ్" వాడిపోతున్న మొహం మీద చిఱునవ్వు ముసుగు తగిలించుకుని బ్రతిమాలుతున్న ధోరణిలో అడిగాడు, ఏకాంబరం.

"మీ సినిమా నిండా అసభ్య దృశ్యాలే. ఎలా ఇమ్మంటారు సెన్సార్ సర్టిఫికెట్. అసలు మీ హీరోయిన్ ఈ చలికాలంలో కూడా ముప్పాతిక భాగం శరీరానికి ఏ బట్టలూ లేకుండా ఎలా నటించిందో నాకు అర్థంకావడంల్లేదు. హీరోయిన్ శరీరాన్ని నగ్నంగా చూపించి, చౌకబారు దృశ్యాలు ప్రదర్శించి ప్రేక్షకుల బలహీనత మీద సొమ్ము చేసుకునే వాళ్ళంటే నాకు చికాకు. మీ సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వలేము. మీరు వెళ్ళిరండి" మృదువుగా అంది కౌసల్యాదేవి.

"మీరు అలా అంటే నిండా మునిగిపోతాను మేడమ్. నా సర్వశ్వం వెచ్చించి, ఫైనాన్సియర్ల దగ్గర తలతాకట్టు పెట్టి ఈ సినిమా తీశాను. ఈసారికి మీరు పెద్ద మనసు చేసుకొని సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వండి. మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను" గొణిగాడు ప్రొడ్యూసర్ ఏకాంబరం.

"మీ సర్వశ్వం వెచ్చించడానికి అసలు మీరు హీరోయిన్ ఒంటికి గుడ్డలే చుట్టలేదుకదండి. చిన్నమొత్తాల పొదుపు సంస్థ వారు మీ దగ్గర, మీ హీరోయిన్ దగ్గర నేర్చుకోవలసింది చాలా వుంది. సారీ! ఈ విషయంలో నేనేమి చేయలేను" చెప్పింది కౌసల్యాదేవి.

"సరే ఏం జేస్తాంలెండి. ఏదో ఈ సినిమా రిలీజు చేసుకొని, ఫైనాన్సియర్ల అప్పులు తీర్చేసి, వచ్చిన లాభంతో చిన్న బట్టలకొట్టు పెట్టుకొని కృష్ణా, రామా అంటూ గడిపేద్దాం అనుకున్నా. ఇప్పుడు ఈ తీసిన సినిమా అంతా తగలబెట్టి, మరో సినిమా తీయాలి. ఆ కృష్ణవేణి గారి దగ్గర మాంచి కథ ఒకటి వుందట. అది కొనుక్కుని మరో సినిమా తీసి ఫైనాన్సియర్ల అప్పులు తీరుస్తా. అది మంచి ఫ్యామిలీ సెంటిమెంట్ వున్న కథ అని కృష్ణవేణిగారు చెప్పారు. ఎంత రేటు అయినా ఇచ్చి ఆ కథ కొనుక్కోవాలి. ఇది అసలే పోటీ ప్రపంచం. మీతో మాట్లాడుతూ కూర్చుంటే నేను వెనకబడిపోతా, వస్తా" సోఫాలో నుంచి లేచి నిలపడ్డాడు ప్రొడ్యూసర్ ఏకాంబరం,

"ఎవరు! ఆ రచయిత్రి వల్ల కృష్ణవేణి దగ్గరకా మీరువెళ్ళేది". అడిగింది కౌసల్యాదేవి.

"అవును మేడమ్. వస్తా" బయటికి నడవబోయాడు ఏకాంబరం.

"మళ్ళీ కథ కొనుక్కుని, స్టార్స్‌ని బుక్ చేసుకుని సినిమా నిర్మించడం అంటే మాటలు కాదు కదా, లక్షలతో వ్యవహారం. మళ్ళీ ఈ సినిమా ప్రపంచం జోలికి రానంటున్నారు కనుక ఈసారికి మీ సినిమాకి సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తా. కథ కొనే ప్రయత్నం చేయకండి" అంది కౌసల్యాదేవి.

ఆవిడకి కృతజ్ఞతలు తెల్పి పక్కనే కూర్చుని వున్న బావమరిదిని తీసుకొని బయటికి నడిచాడు ప్రొడ్యూసర్ ఏకాంబరం.

"ఎంత ధైర్యం బావా! మళ్ళీ సినిమా నిర్మించడానికి" అడిగాడు బావమరిది కాళిదాసు.

"నేనేం పిచ్చివాడినా ఈ సినిమా రీళ్ళు తగలబెట్టి, మళ్ళీ సినిమా నిర్మించడానికి. ఈ కౌసల్యాదేవికి, ఆ కృష్ణవేణికి పడదు. ఆవిడ రచయిత్రిగా వెలగడం ఈవిడకి ఇష్టంలేదు. ప్రొడ్యూసర్ అంటే అన్ని విషయాలు తెలుసుకోవాలి" చెప్పాడు ఏకాంబరం. నోరువెళ్ళబెట్టాడు కాళిదాసు.

